సాక్షి నిజామాబాద్

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



'క్రిప్టో' కేసులో ఎస్సై

క్రిప్టో కరెన్సీ యూబిట్ కాయిన్ కేసులో ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ ఉండడం ఆ శాఖలో కలకలం రేపుతోంది.

- 8లో ▸



పాత పెన్షన్ కోసం..

ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.8 /22.1

వాతావరణం

చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

తూంపల్లిలో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం

సిరికొండ: మండలంలోని తూంపల్లిలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. తూంపల్లిలో 199.8 మి.మీ(19 సెం.మీ) వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్యన ఈ వర్షపాతం నమోదైంది. దీంతో తూంపల్లి అడవుల నుంచి మొదలయ్యే కప్పలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

గోదావరికి పెరుగుతున్న వరద



రెంజల్: రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి నదికి వరద పెరిగింది. తెలంగాణతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో మంజీర, హరిద్ర నదుల నుంచి వరద నీరు వచ్చి కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తోంది. పుష్కరక్షేత్రం వద్ద నదిలోని పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగింది. నదిలో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్ అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వర్షాలతో జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు నెలకొంటే ప్రజలు కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08462- 220183కు సమాచారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ఏవో ప్రశాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

నిజామాబాద్ అర్బన్: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు విధిగా ఈ ఆదేశాలను పాటించాలని సూచించారు.

తెయూ పరిధిలో నేటి పరీక్ష వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): భారీ వర్షాల కారణంగా తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరగాల్సిన థియరీ, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ వాయిదా వేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన టైం టేబుల్ ప్రకారం ఈ నెల 3 నుంచి పరీక్షలు యథావిధిగా జరుగుతాయన్నారు. వాయిదా వేసిన పరీక్షను నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

వాన.. వరద

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం నుంచి తెరిపినివ్వకుండా వాన పడుతూనే ఉంది. దీంతో చెరువులు, కుంటలు నిండాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదులు జలకళను సంతరించుకున్నాయి. ఆదివారం మొత్తం వర్షం పడుతూనే ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



కమ్మర్‌పల్లి- ఉప్లూర్ మార్గంలో కోతకు గురైన రోడ్డు



వేల్పూర్ మండలం అక్లూర్ చెక్‌డ్యాంపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న కప్పల వాగు

- పొంగిపొర్లిన వాగులు
- అలుగెల్లిన చెరువులు
- రాకపోకలకు అంతరాయం
- జనజీవనంపై తీవ్ర ప్రభావం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో మొత్తం 1,086 చెరువులు ఉండగా ఇందులో 359 చెరువులు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. ప్రధాన జలాశయమైన శ్రీరాంసాగర్‌లోకి 94 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయం సామర్థ్యం 80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 65 టీఎంసీల నీటితో కళకళలాడుతోంది.

■ బాల్కొండ నియోజక వర్గంలో పెద్దవాగు, కప్పల వాగు, రాళ్ల వాగు, మొండివాగు పొంగి ప్రవహిస్తున్నాయి. ఏర్గట్ల మండల కేంద్రం చుట్టూ ఉన్న వాగుల నుంచి నీరు రోడ్లపైకి రావడంతో స్థానికులు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి అందుబాటులో ఉంటున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ వాగుల వైపు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు పాత ఇళ్లలో ఉన్నవారిని ఖాళీ చేయాలని సూచనలు చేశారు.



సిరికొండలో దొండ్ల వాగు ఉధృతంగా పారుతుండటంతో రోడ్డు మూసివేసిన అధికారులు



మోపాల్ మండలం మంచిప్పలో అలుగు పారుతున్న చెరువు

■ ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్ మున్సిపాలిటీ, నందిపేట్, మాక్లూర్, ఆలూర్, డొంకేశ్వర్ మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఆర్మూర్ పట్టణంలోని 63వ నంబర్ జాతీయ రహదారితో పాటు ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో మున్సిపల్ సిబ్బంది మురుగు కాలువల్లో చెత్తను తొలగించారు.

■ బోధన్ డివిజన్‌లోని రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతోంది. సాలూర శివారులో సాయంత్రం 4 గంటల వరకు మంజీర నదికి స్వల్పంగా వరద పెరిగింది. రుద్రూర్-బొప్పాపూర్ మధ్య ఉన్న వాగు రోడ్డు మీదుగా పారుతోంది. అధికారులు రాకపోకలు నిలిపేశారు. కోటగిరి మండలం దోమలెడిగి-పోతంగల్ మండలంలోని కొల్లూరు మధ్య వాగుపై కొత్త వంతెన నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు మీదుగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్ని మండలం జలాల్‌పూర్-బడాపహాడ్ మధ్య చెరువు అలుగు పారుతోంది. నీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపేశారు. బోధన్ మండలంలోని పసుపు వాగు ఉధృతంగా పారుతోంది. బోధన్ పట్టణంలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



ఆర్మూర్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద నేలకొరిగిన చెట్టు

■ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో డిచ్‌పల్లి మండలం యానంపల్లి నుంచి యానంపల్లి తండా వెళ్లే రోడ్డులో ఉన్న చెరువు నిండి అలుగు పారుతోంది. నీళ్లు రోడ్డుపైకి రావడంతో అధికారులు రాకపోకలు నిలిపేశారు. సుద్దులం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉంటున్న వారిని అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలించారు. సుద్దులం, కొరట్‌పల్లి గ్రామాల మధ్య చింతలకుంట అలుగు పారి నీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇందల్వాయి, ధర్పల్లి మార్గంలో వెంగల్పాడు వద్ద నిర్మిస్తున్న వంతెన వద్ద సర్వీస్ రోడ్డు కొట్టుకపోవడంతో పోలీసులు మార్గాన్ని మూసేశారు. సిరికొండ మండలం గడ్కోల్ వద్ద కప్పల వాగు ప్రవాహానికి అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచాయి. ధర్పల్లి మండలం వాడి వాగు వరద ప్రవాహానికి సర్వీస్ రోడ్డు కొట్టుకుపోయింది. మోపాల్ మండలంలోని మంచిప్ప పెద్ద చెరువు అలుగు పారుతోంది. మోపాల్ మండలం మంచిప్ప-అమ్రాబాద్ మధ్య వాగు పొంగడంతో రాకపోకలు నిలిచాయి. సిర్పూర్ నుంచి ముదక్‌పల్లి వెళ్లే రోడ్డులో లోలెవల్ వంతెనపై నుంచి నీరు ఉధృతంగా పారుతోంది.

■ నిజామాబాద్ నగరంలో శివారు ప్రాంతాల్లో వర్షపు నీరు చెరువులను తలపిస్తోంది. కల్వర్టులు, డ్రెయినేజీలు పొంగాయి. పూలాంగ్, రైల్వే అండర్ బ్రిడ్జి, మాలపల్లి, అర్సపల్లి, గౌతంనగర్, నాగారం ప్రాంతాల్లో కాలనీలు జలమయమయ్యాయి.

జిల్లాలో ఆదివారం నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	ప్రాంతం	వర్షపాతం (మి.మీ.లలో)
సిరికొండ	తూంపల్లి	199.8
సిరికొండ	చీమన్‌పల్లి	146.0
సిరికొండ	సిరికొండ	118.0
మోపాల్	మంచిప్ప	67.8
ఇందల్వాయి	గన్నారం	66.3
కమ్మర్‌పల్లి	కొనసముందర్	57.5
జక్రాన్‌పల్లి	జక్రాన్‌పల్లి	51.0
వేల్పూర్	వేల్పూర్	50.0
మోర్తాడ్	మోర్తాడ్	49.8
డిచ్‌పల్లి	డిచ్‌పల్లి	49.0
ఆర్మూర్	మగ్గిడి	47.5
డిచ్‌పల్లి	కొరట్‌పల్లి	47.3
ధర్పల్లి	ధర్పల్లి	46.0
మాక్లూర్	మదన్‌పల్లి	43.3
పోతంగల్	పోతంగల్	42.3
కోటగిరి	కోటగిరి	40.8
నవీపేట	నవీపేట	40.0
వర్ని	జకారో	39.3
ఏర్గట్ల	ఏర్గట్ల	37.3
ఆలూరు	ఆలూరు	37.3
బాల్కొండ	బాల్కొండ	36.8
చందూరు	చందూరు	36.5
రుద్రూర్	రుద్రూర్	34.8
ఎడపల్లి	జానకంపేట	34.8
బోధన్	బెల్లాల్	34.8
నిజామాబాద్ సౌత్	నిజామాబాద్	33.3
కమ్మర్‌పల్లి	కమ్మర్‌పల్లి	32.8
ఎడపల్లి	ఎడపల్లి	30.0
భీమ్‌గల్	భీమ్‌గల్	29.8
ఆర్మూర్	పెర్కిట్	29.8
ముప్కాల్	వేంపల్లి	28.5
రెంజల్	రెంజల్	27.5
సాలూరా	సాలూరా	26.8
నిజామాబాద్ నార్త్	గూపన్‌పల్లి	26.8
నిజామాబాద్ రూరల్	పాల్దా	26.8
ముప్కాల్	ముప్కాల్	26.0
బోధన్	కల్దుర్కి	22.5



మైలారంలో జలమయమైన విద్యానగర్ కాలనీ

జిల్లాలో చెరువుల వివరాలు

నియోజకవర్గం	మొత్తం చెరువులు	25 శాతం నిండినవి	25-50శాతం నిండినవి	50-75శాతం నిండినవి	75-100 శాతం నిండినవి	అలుగులు పారుతున్నవి
నిజామాబాద్	324	1	21	53	202	47
బోధన్	182	0	1	2	61	118
ఆర్మూర్	198	0	0	37	78	83
బాల్కొండ	292	2	0	0	199	91
బాన్సువాడ ఆరు మండలాలు	90	0	4	20	46	20
మొత్తం	1086	3	26	112	586	359

పొంగిపొర్లుతున్న చెరువులు

నిజామాబాద్ నాగారం: భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇప్పటికే 359 చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. మరో రెండు రోజుల పాటు ఇలాగే వర్షాలు కురిస్తే అన్ని చెరువులు మత్తడి దూకుతాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎక్కడ కూడా చెరువులకు డ్యామేజ్ కాకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.



సిరికొండలో కూలిన ఇల్లు



ఉధృతంగా ప్రవహిస్తున్న సిరికొండ బొడ్డు మామిడి చెరువు అలుగు



సిరికొండ మండలం చీమన్‌పల్లిలో నీట మునిగిన పంటలు



జలాల్‌పూర్ - బడాపహాడ్ మార్గంలో రోడ్డుపై నుంచి పారుతున్న నీరు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి

నిజామాబాద్ అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఆదివారం వారు డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్‌లు, పోలీస్ కమిషనర్‌లు, ఎస్పీలతో వరద ప్రభావిత పరిస్థితులపై సమీక్షించారు. చేపడుతున్న సహాయక చర్యల గురించి ఆరా తీశారు. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందునా ఎక్కడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యలు చేపట్టేలా రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎక్కడైనా ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైన పక్షంలో హైదరాబాద్ నుంచి సహాయక బృందాలు పంపిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా, పూర్తి అప్రమత్తతో విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. లో లెవల్ వంతెనలు, కాజ్ వేలపై నుంచి నీరు ప్రవహిస్తే వాహనాల రాకపోకలను నిలిపి వేయాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

పంటలకు ముప్పు

డొంకేశ్వర్/బాల్కొండ: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పంటలకు ముప్పు ఏర్పడింది. వరికి పెద్దగా నష్టం లేదు. కానీ మొక్కజొన్న, సోయా, పసుపు పంటలకు నష్టం వాటిల్లనుంది. వర్షాలకు చేతికొచ్చిన మక్క పంట పలు మండలాల్లో నేలకొరిగింది. బుట్టకు నష్టం జరిగే అవకాశముందని వాపోతున్నారు. అలాగే సోయా, పసుపు చేన్లలో వర్షపు నీరు చేరడంతో రైతులు నీటిని తొలగించడానికి శ్రమించారు. వర్షాలు ఇలాగే కురిస్తే పసుపునకు దుంపకుళ్లు వచ్చే అవకాశముంది. కూరగాయల పంటలపై కూడా వర్ష ప్రభావం పడింది. జిల్లా వ్యాప్తంగా ఎంతమేర పంటనష్టం జరిగిందో వ్యవసాయ శాఖ ఇంత వరకు అంచనాకు రాలేదు. సోమవారం నాటికి పంటనష్టం వివరాలను సేకరించి అందజేయాలని ఏఈవోలు, ఎంఏవోలను ఆదేశించినట్లు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ 'సాక్షి'తో తెలిపారు.



కోమట్‌పల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న

ఎకరం పంట నేలకొరిగింది



ఎకరంన్నర మక్క పంట వేశాను. వర్షాలకు ఎకరం దాకా పంట నేలకొరిగింది. చేతికి వచ్చిన పంటకు ఇలా జరగడం బాధగా ఉంది. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– పద్మారావు, కోమట్‌పల్లి, డొంకేశ్వర్ మండలం

ఎస్సారెస్పీలోకి భారీగా వరద

- ప్రాజెక్ట్‌లోకి 94 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వస్తోంది. జలాశయంలోకి 94,746 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. శనివారం 11 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. రాత్రి నుంచి వర్షం ప్రారంభం కావడంతో ఆదివారం ఉదయానికి 22 వేల క్యూసెక్కులకు పెరిగింది. క్రమంగా ఆదివారం రాత్రి 12 గంటలకు 94,746 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రాజెక్ట్‌లోకి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాలు పడుతుండటంతో కాలువల ద్వారా నీటి విడుదలను అధికారులు నిలిపి వేశారు. ఆవిరి రూపంలో 594 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం రాత్రికి 1086.6(65.135 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

వరద కాలువ ద్వారా నీటి విడుదల

ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తుండటంతో వరద కాలువ ద్వారా ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం సాయంత్రం నీటి విడుదలు ప్రారంభించారు. ముందుగా 1500 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదలను పెంచుతామని అధికారులు తెలిపారు.

ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు



క్లుప్తంగా

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో



బోధన్‌రూరల్‌: మండలంలోని పెగడపల్లి – బోధన్‌ రోడ్డులో ఓ ప్యాసింజర్‌ ఆటో అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం రెంజల్‌ మండలంలోని సాటాపూర్‌ నుంచి బోధన్‌ వైపు ఆటో వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో సమయంలో ఆటోలో ఇద్దరు ప్రయాణికులు ఉండగా.. వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ముప్పు తప్పింది. స్థానికులు ట్రాక్టర్‌ సహాయంతో ఆటోను బయటకి తీశారు.

సొసైటీ అక్రమాలపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్‌..

బాల్కొండ: మెండోరా మండలం సావెల్‌ సొసైటీలో చోటు చేసుకున్న అక్రమాలపై ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'సావెల్‌ సొసైటీలో అక్రమాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన డీసీవో శ్రీనివాస్‌ సొసైటీలో అక్రమాలపై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణ అధికారిగా డిచ్‌పల్లి క్లస్టర్‌ అసిస్టెంట్‌ రిజిస్టర్‌ సత్యనారాయణరావును నియమించారు. నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీసీవో ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ ఆనకట్టపై గ్యాంబ్లింగ్‌

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ ఆనకట్టపై లక్కీ లాటరీ తరహాలో గ్యాంబ్లింగ్‌ (లప్పం కిరికిర) అనే ఆటను ఆదివారం దర్జాగా నిర్వహించారు. ప్రాజెక్ట్‌ అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులను టార్గెట్‌గా చేసుకొని వారిజేబులను ఖాళీ చేశారు. మూడు స్ట్రైగర్‌లతో ఆడే ఆటలో రూ.50కి రూ.100 చెల్లిస్తామని అమాయకులకు ఆశచూపి యథేచ్ఛగా డబ్బులు దండుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పర్యాటకులు క్షణాల్లో ఒక్కొక్కరు వందల రూపాయలు నష్టపోయారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు ముప్కాల్‌, బాల్కొండ, మెండోరా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉండటంతో ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డెంగీతో ఇంటర్‌ విద్యార్థి మృతి



కామారెడ్డి టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్‌ గ్రామానికి చెందిన ఇంటర్‌ ఫస్టియర్‌ విద్యార్థి సుజిత్‌ (16) డెంగీతో ఆదివారం మృతి చెందాడు. పది రోజుల క్రితం తీవ్ర జ్వరం బారినపడిన సుజిత్‌ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ హాస్పిటల్‌లో చికిత్స పొందాడు. డెంగీ పాజిటీవ్‌తోపాటు ప్లేట్‌లెట్స్‌ తగ్గడం, పరిస్థితి విషమించడంతో వైద్యు లు హైదరాబాద్‌కు రిఫర్‌ చేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. జిల్లాలో ఇప్పటివరకు డెంగీతో మృతిచెందిన వారి సంఖ్య ఏడుకు చేరింది.

పైప్‌లైన్‌ గుంతలోపడి గేదె..

కామారెడ్డి రూరల్‌: మంచినీటి సరఫరా కోసం వేసిన మిషన్‌ భగీరథ పైప్‌ లైన్‌ గుంతలో పడి గేదె మృతి చెందింది. శాబ్దిపూర్‌ తండాకు చెందిన మాజీ సర్పంచ్‌ బానోత్‌ వినోద లక్ష్మణ్‌కు చెందిన పాడి గేదె బైపాస్‌ రోడ్డు పక్కన ఉన్న మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ గుంతలో పడి చనిపోయింది. అధికారులకు సమాచారం ఇవ్వగా తమకు ఎలాంటి సంబంధం లేదని, ఏమి చేసుకుంటారో చేసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని బాధితులు తెలిపారు.



బోధన్‌ మండలం చిన్నమావంది వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పసుపు వాగు



వన్నెల్‌(బీ) - బోదేపల్లి మధ్య వంతెనపై నీరు..



డొంకేశ్వర్‌ మండలం కోమట్‌పల్లి-నికాల్‌పూర్‌ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు



కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌ కొత్త చెరువు తండా రోడ్డుపై ఏర్పడిన గుంత



కోనాపూర్‌ - ఆత్మకూర్‌ మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న అలుగునీరు

జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల రోడ్లపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టారు. వరదనీరు ప్రవహిస్తున్న రోడ్ల మీదుగా వాహనాలు రాకపోకలు సాగించకుండా బారీకేడ్లు, ట్రాక్టర్లను అడ్డుగా ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్‌



హుస్సేన్‌నగర్‌ వద్ద పొలాల్లోకి వరద..



ధర్పల్లి మండలం వాడి వద్ద కొట్టుకుపోయిన రోడ్డు



బొప్పాపూర్‌ - రుద్రూర్‌ రోడ్డుపై..



రోడ్డు పై ప్రవహిస్తున్న రుద్రూర్‌ చెరువు నీరు



మంచిప్ప నుంచి అమ్రాబాద్‌ వెళ్లే రోడ్డులో..

మంజీరకు జలకళ



మంజీరపై పాత వంతెను ఆనుకుని వరద ప్రవాహం

బోధన్‌: తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల్లోని సాలూర మండల కేంద్రంలో శివారులో మంజీర జలకళను సంతరించుకుంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వరద ప్రవాహం స్వల్పంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో నీటి ప్రవాహ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. నది పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మానేరు ప్రాజెక్టులో జాలరి గల్లంతు



ఘటనాస్థలంలో విచారణ చేపడుతున్న పోలీసులు

మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట శివారులో ఉన్న మానేరు ప్రాజెక్టులో ఓ జాలరి గల్లంతయ్యాడు. ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని లచ్చాపేటకు చెందిన జాలరి కైరం కొండ శివరాములు(55) ఆదివారం గ్రామ శివారులోని మానేరు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లాడు.ఆయన ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రాజెక్టు వద్దకు వెళ్లగా, ఒడ్డుపై బైక్‌, దుస్తులు, చెప్పులు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్సై విచారణ చేపట్టారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గాలింపు చర్యలకు ఆటంకం కలుగుతోందని ఎస్సై తెలిపారు.

వర్షానికి కూలిన ఇండ్లు



ఇల్లు కూలిపోవడంతో రోడ్డున పడ్డ కుటుంబం

సిరికొండ: భారీ వర్షం కారణంగా మండలంలోని పాకాలలో తేజావత్‌ రాంరెడ్డి అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. రాంరెడ్డి కుటుంబ సభ్యులు సామగ్రితో రోడ్డుపైకి వచ్చారు. అలాగే మండల కేంద్రంలో కుమ్మరి లచ్చన్నకు చెందిన పురాతన ఇల్లు కూలింది. శిథిలావస్థకు చేరిన ఇల్లు కావడంతో ఆ ఇంట్లో ఎవరూ ఉండటం లేదు.

పాత పెన్షన్‌ అమలయ్యే వరకు ఉద్యమిస్తాం



నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్‌ జేఏసీ నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: ఎంప్లాయిస్‌ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ ఆవరణలో ఎంప్లాయిస్‌ జేఏసీ ఆధ్వర్యంలో పెన్షన్‌ విద్రోహ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్‌ జేఏసీ చైర్మన్‌ అలుక కిషన్‌ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలన్నారు. పాత పెన్షన్‌ విధానం అమలయ్యే వరకు ఉద్యమిస్తామన్నారు. కొంత మంది ఉద్యోగులు దురదృష్టవశాత్తు మరణిస్తున్నప్పటికీ బాధిత కుటుంబాలకు ఎలాంటి సౌకర్యాలు అందడం లేదన్నారు. త్వరలో స్టీరింగ్‌ కమిటీని వేసి దాని ద్వారా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో టీఎన్జీవోఎస్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమృత్‌కుమార్‌, హనుమంతరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ప్రశాంత్‌, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, టీఎన్జీవోఎస్‌ ఉపాధ్యక్షుడు నాగరాజు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. తపస్‌ ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బద్రీనాథ్‌, కృష్ణవేణి, నాయకులు రామకృష్ణారెడ్డి, రాజా, అనిల్‌, రాచర్ల గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు. బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పూలాంగ్‌ చౌరస్తాలోని అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అంజదేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు ఎం విజయ్‌ కుమార్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ శంకర్‌, మాక్లూర్‌ మండల బీసీటీయూ అధ్యక్షుడు గంగోనె సంజీవ్‌, డిచ్‌పల్లి మండలం బీసీటీయూ అధ్యక్షుడు కొట్టాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ రద్దయ్యే వరకు పోరాటం చేస్తాం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్‌: ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్‌ విద్రోహ దినంగా భావిస్తూ తెలంగాణ ఎంప్లాయిస్‌ గెజిటెడ్‌ ఆఫీసర్స్‌, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్‌ కార్యాలయం ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. సీపీఎస్‌ రద్దు చేయాలని ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ వర్షంలో నల్లరంగు గొడుగులతో, ప్లకార్డుల ప్రదర్శనతో ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, సాయిలు, సాయిరెడ్డి, దామోదర్‌రెడ్డి, కుంట ఎల్లారెడ్డి, సీహెచ్‌ అనిల్‌కుమార్‌, హన్మంత్‌రెడ్డి, రాములు, రాజు, గంగాగౌడ్‌, ముజీబొద్దీన్‌, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



తహసీల్‌ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌

నిజాంసాగర్‌(జుక్కల్‌): కుండపోతగా కురుస్తున్న వర్షాలు, వరద ప్రవాహంపై అధికారులు అప్రమత్తంగా ఉన్నారని బాన్సువాడ సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి అన్నారు. లోలెవల్‌ వంతెనలు, వాగుల వద్ద వరద ప్రవాహం కారణంగా ప్రాణనష్టం జరగకుండా పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం మహమ్మద్‌నగర్‌ తహసీల్‌ కార్యాలయాన్ని సందర్శించి వరదలు, నీట మునిగిన రహదారులు, నేలకూలిన ఇళ్ల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగితం రిజర్వాయర్‌ను సందర్శించి రిజర్వాయర్‌లోకి వస్తున్న వరద వివరాలను నీటి పారుదలశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు నేలకూలిన ఇళ్ల బాధితులకు ప్రభుత్వ పాఠశాలల్లో, రైతు వేదికల్లో పునరావసం కల్పించామని చెప్పారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్‌ కలెక్టర్‌ వెంట తహసీల్దార్‌ సవాయిసింగ్‌, ఎంపీడీవో గంగాధర్‌, ఎంపీవో అనిత, నీటి పారుదలశాఖ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ కాశీనాథ్‌, పంచాయతీ కార్యదర్శి మతిన్‌, రెవెన్యూ ఉద్యోగులు అశోక్‌, సిద్దు, గోపాల్‌ తదితరులు ఉన్నారు.

మూడేళ్లుగా మీరేం చేస్తున్నారు..?

- ఇరిగేషన్‌ అధికారుల తీరుపై సీఈ ఆగ్రహం



నస్రుల్లాబాద్‌: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాల్మన్‌ కుంట చెరువుకు గండి పండింది. విషయం తెలుసున్న ఇరిగేషన్‌ సీఈ టి శ్రీనివాస్‌ చెరువును పరిశీలించారు. మూడేళ్లుగా చెరువుకు ప్రతి వర్షాకాలం బుంగ పడుతోందని స్థానికులు తెలిపారు. దీంతో మూడేళ్లుగా మీరేం చేస్తున్నారని సంబంధిత కాంట్రాక్టర్‌తో చెప్పి పనులు చేయించాలి కదా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత ప్రమాదకరంగా ఉన్న బుంగను పూడ్చాల్సిన అధికారులే కాంట్రాక్టర్‌కు కొమ్ముకాస్తున్నారా అంటూ హెచ్చరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే చెరువుకు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్‌ డీఈ జగదీశ్‌, ఏఈ షరీఫ్‌, మాజీ సర్పంచ్‌ అన్నం సత్యనారాయణ ఉన్నారు.

సీనియర్‌ సివిల్‌ జడ్జిగా పదోన్నతి

ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర జ్యూడీషియల్‌ సర్వీస్‌ రూల్స్‌ 2017లోని రూల్‌ 14 (1ఎ) ప్రకారం తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న ముగ్గురు సీనియర్‌ సివిల్‌ జడ్జీలతోపాటు పలువురు సివిల్‌ జడ్జీలకు (జూనియర్‌ డివిజన్‌) రూల్‌ 4.2(బీ)(ఎ) కింద సీనియర్‌ సివిల్‌ జడ్జీలుగా పదోన్నతి పొందారు. 2024 సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ రూల్స్‌, 2023 ప్రకారం పదోన్నతులిస్తూ హైకోర్టు రిజిస్టర్‌ జనరల్‌ ఆగస్టు 30న ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్‌ డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి పద్మావతికి పదోన్నతి లభించింది.

క్రైం కార్నర్‌

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. పట్టాలు దాటుతున్న యువకుడిని గూడ్స్‌ రైలు ఢీకొట్టిందన్నారు. మృతుడి వయస్సు సుమారు 34 ఏళ్లు ఉంటుందని, అతడి జేబులో బాన్సువాడ నుంచి నిజామాబాద్‌కు వచ్చిన బస్‌ టికెట్‌ లభించిందని, చేతిపై ఆర్‌ఆర్‌ఆర్‌ అని పచ్చబొట్టు ఉందని ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్సై 8712658591ను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

ఫిట్స్‌తో ఒకరు..



వర్ని (రుద్రూర్‌): మండలంలోని ఆఫందిఫారం శివారులో హైదరాబాద్‌కు చెందిన చాంద్‌ పాషా (38) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్‌ తెలిపారు. మండలంలోని సేవాలాల్‌తండాలో నివాసముంటున్న తన కూతురు నౌసిన్‌బేగం ఇంటికి చాంద్‌పాషా వారం రోజుల క్రితం వచ్చాడు. కల్లుతాగే అలవాటు ఉన్న చాంద్‌ పాషా ఇక్కడికి వచ్చిన తరువాత పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తూ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం ఆఫందిఫారం శివారులోని సాగర్‌ కాలువ వద్ద విగతజీవిగా కనిపించాడు. తిండి లేకపోవడంతోపాటు ఫిట్స్‌ కారణంగా మృతి చెంది ఉంటాడని మృతుడి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొలంలో పడి వృద్ధురాలు..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మతిస్థిమితం లేని మహిళ ప్రమాదవశాత్తు పొలంలో పడి మృతి చెందిన ఘటన మండలంలోని అడ్లూర్‌ ఎల్లారెడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నమ్మగారి బాల్‌రాజవ్వ(70) మతిస్థిమితం లేక అనారోగ్యంతో గ్రామంలో తిరుగుతుండేది. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. గ్రామ సమీపంలోని పొలంలో పడి బాల్‌రాజవ్వ మృతి చెందినట్లు ఆదివారం ఉదయం గ్రామస్తులు సమాచారం అందించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవాలపై చిరుత దాడి



నిజామాబాద్‌ రూరల్‌: గొర్రెలపై చిరుత దాడి చేసిందని మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన సాయన్న తెలిపారు. ఆదివారం ఉదయం గొర్రెలను మేపేందుకు నికి మల్కాపూర్‌ (ఏ) గ్రామ శివారులోకి తీసుకెళ్లగా చిరుత గొర్రెల మందపై దాడి చేసిందన్నారు. ఈ విషయమై అటవీ అధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని సమాధానమిచ్చారు.

ఇతరులతో ఫోన్‌ మాట్లాడుతోందని హత్య

- డిచ్‌పల్లి వివాహిత మృతి కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌

డిచ్‌పల్లి: మండల కేంద్రంలో గత నెల 29న రాత్రి చోటుచేసుకున్న విజయ అలియాస్‌ మీనాక్షి(32) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఇతరులతో ఫోన్‌ మాట్లాడుతోందనే అనుమానంతో భర్తే ఆమెను హత్య చేశాడని తేల్చారు. కేసుకు సంబంధించిన వివరాలను డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌ ఆదివారం వెల్లడించారు. సదాశివనగర్‌ మండలం యాచారం గ్రామానికి చెందిన రాథోడ్‌ విజయ అలియాస్‌ మీనాక్షి (32)కి 2016లో డిచ్‌పల్లి మండలం వెస్లీ నగర్‌ తండాకు చెందిన రాథోడ్‌ గబ్బర్‌సింగ్‌తో రెండో వివాహమైంది. ఏడాదిగా గబ్బర్‌సింగ్‌ వృత్తిరీత్యా హైదరాబాద్‌లో విజయతో కలిసి ఉంటున్నాడు. అయితే, తాను హైదరాబాద్‌లో లేని సమయంలో భార్య విజయ ఇతరులతో ఫోన్‌ మాట్లాడుతోందని గబ్బర్‌సింగ్‌ అనుమానం పెంచుకున్నాడు. కొన్ని రోజుల క్రితం డిచ్‌పల్లిలోని సాయినగర్‌ కాలనీలో తన ఇంటికి వచ్చిన గబ్బర్‌సింగ్‌ ఇక్కడే ఉంటున్నాడు. గత నెల 29న (గురువారం) రాత్రి భార్యకు ఫోన్‌ చేసి డిచ్‌పల్లి కి పిలిపించుకున్నాడు. ఇంట్లోని పైపోర్షన్‌ లో భార్య విజయను దూషించి కొట్టి మెడకు చున్నీచుట్టి హతమార్చాడు. ఆ తరువాత సీలింగ్‌ ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. మృతురాలి తల్లి సకున ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ మల్లేశ్‌ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి విజయది హత్యగా తేల్చారు. శనివారం గబ్బర్‌ సింగ్‌ని అరెస్ట్‌ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కేసును దర్యాప్తు చేసిన సిబ్బందిని సీఐ అభినందించారు.

ప్రేమికుడే హంతకుడు

బాన్సువాడ నర్సు మృతి కేసును ఛేదించిన పోలీసులు



కేసుకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

బాన్సువాడ: పట్టణంలోని సెవెన్‌ హిల్స్‌ ఆస్పతి నర్సు మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆమెను ప్రియుడే హతమార్చినట్లు దర్యాప్తులో తేల్చారు. సీఐ కృష్ణ ఆదివారం కేసు వివరాలను వెల్లడించారు. బీర్కూర్‌ మండలం బరంగెడ్గికి చెందిన మమత పట్టణంలో గదిని అద్దెకు తీసుకుని ప్రైవేట్‌ ఆస్పత్రిలో పని చేస్తోంది. వాజిద్‌నగర్‌కు చెందిన ప్రశాంత్‌తో మమత మూడేళ్లుగా ప్రేమలో ఉంది. పెళ్లి విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తన తల్లి ఇంటికి రమ్మనదని, ఐదు రోజులు సెలవుపెట్టి వెళ్తున్నానని ప్రశాంత్‌తో మమత తెలిపింది. ఆలోగా మీ ఇంట్లో పెళ్లి గురించి మాట్లాడాలని ప్రశాంత్‌ను ఒత్తిడి చేసింది. తన చెల్లి పెళ్లి తరువాత ఇంట్లో వాళ్లని ఒప్పించి పెళ్లి చేసుకుందామని ప్రశాంత్‌ చెప్పినా మమత వినకపోవడంతో ఆమెను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. గత నెల 30వ తేదీన చున్నీతో ఆమెకు ఉరివేసి హత్యచేశాడు. ఆ తరువాత స్నేహితుడికి ఫోన్‌ చేసి మమత ఫ్యాన్‌కు ఉరేసుకుందని, వెంటనే డాక్టర్‌ను తీసుకురావాలని కోరాడు. డాక్టర్లు ఎవరూ రావడం లేదని స్నేహితుడు తెలపడంతో ఆమెను భుజంపై వేసుకుని ప్రశాంత్‌ మెట్లు దిగుతుండగా ఇంటి ఓనర్‌ ఏమైందని ప్రశ్నించాడు. ఫిట్స్‌ వచ్చిందని ప్రశాంత్‌ సమాధానం చెప్పి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలుపడంతో మమత బంధువులకు ఫోన్‌ చేసిన ప్రశాంత్‌.. ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలిపి అక్కడి నుంచి పరారయ్యాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రశాంతే మమతను హత్య చేసినట్లు తేల్చారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- భార్య రాదని మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం
- పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో అందరూ చూస్తుండగానే ఘటన
- పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి



సుకృత్‌ (ఫైల్‌)

నందిపేట్‌ (ఆర్మూర్‌): గొడవల కారణంగా వెళ్లిపోయిన భార్య తన వద్దకు రాదేమోననే మనస్తాపంతో మండలంలోని కుద్వాన్‌పూర్‌ గ్రామానికి చెందిన సుకృత్‌ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. సుకృత్‌ అదే గ్రామానికి చెందిన రజితను ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజుల తరువాత భార్యాభర్తల మధ్య గొడవ జరిగి విషయం పోలీస్‌ స్టేషన్‌కు వరకు వెళ్లింది. శుక్రవారం రోజున పోలీసులు ఇరువురిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్‌ ఇవ్వగా, తన భర్త మారడని, నేను తన వద్దకు వెళ్లనని రజిత మొండికేసింది. దీంతో తన భార్య రాదనే మనస్తాపంతో సుకృత్‌ పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలోనే అందరూ చూస్తుండగా గడ్డిమందు తాగాడు. అక్కడున్న వారు తేరుకొని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సుకృత్‌ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

'క్రిప్టో' కేసులో నిందితుడిగా ఎక్సైజ్‌ ఎస్సై



పెర్కిట్‌(ఆర్మూర్‌): నిర్మల్‌ జిల్లాలో క్రిప్టో కరెన్సీ యూబిట్‌ కాయిన్‌ కేసులో ఆదివారం నిర్మల్‌ జిల్లా పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ఆర్మూర్‌ ఎక్సైజ్‌ ఎస్సై గంగాధర్‌ ఉండడం ఆ శాఖలో కలకలం రేపుతోంది. నిజామాబాద్‌ జిల్లాకు చెందిన పలువురితో గంగాధర్‌ ఆన్‌లైన్‌లో క్రిప్టో కరెన్సీ ద్వారా అధిక లాభాలు గడించొచ్చని పెట్టుబడులు పెట్టించినట్లు సమాచారం. కాగా నిర్మల్‌ జిల్లాలో బాధితులు ఫిర్యాదు మేరకు ప్రత్యేక పోలీసు బృందం ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా అందులో ఆర్మూర్‌ ఎక్సైజ్‌ ఎస్సై గంగాధర్‌ సైతం నిందితుడిగా ఉండటం విస్మయానికి గురిచేసింది.

అత్యాశకుపోయి..

ఆర్మూర్‌ ఎక్సైజ్‌ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న గంగాధర్‌ మరో ఆరు నెలల్లో పదోన్నతి పొందనున్నారు. ఈ క్రమంలో అత్యాశకు పోయి అరెస్టు కావడం ఆయన సర్వీసులో తీరని మచ్చ అని ఆ శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. నిర్మల్‌ జిల్లాకు చెందిన గంగాధర్‌ ఎంపీడీవోగా పని చేస్తూనే 2005లో ఎక్సైజ్‌ శాఖలో ఎస్సైగా ఎంపికయ్యారు. ప్రభుత్వం పోస్టింగ్‌ ఇవ్వకపోవడంతో గంగాధర్‌ మళ్లీ పంచాయత్‌ రాజ్‌ శాఖలో చేరారు. సుప్రీం కోర్టు రెండేళ్ల క్రితం ఇచ్చిన తీర్పుతో గంగాధర్‌ ఎక్సైజ్‌ శాఖలో ఎస్సైగా విధుల్లో చేరారు.